Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 121 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 16 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## శ్రీ సిటీకి 6వేల ఎకరాలు భూములిస్తాం... అభివృద్ధికి మోడల్ గా తీర్చిదిద్దుతాం

**- రాయలసీమలో కియా కార్లు, స్పేస్, డ్రోన్ సిటీలు... ఇప్పుడు రేమాండ్స్ - రేమాండ్ ప్రాజెక్టులకు శంకుస్థాపన, శ్రీసిటీలో కంపెనీల ప్రారంభోత్స సదస్సులో ముఖ్యమంత్రి - రూ.1201 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసే రేమాండ్ ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన - శ్రీసిటీలో 5 కంపెనీలను ప్రారంభించిన ముఖ్యమంత్రి - శ్రీసిటీలో ఏర్పాటు చేసే 12 కంపెనీలతో సీఎం సమక్షంలో ఎంఓయూలు కుదర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీసిటీకి 6 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అలాగే శ్రీసిటీని అభివృద్ధికి మోడల్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజైన శనివారం నాడు ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భాగస్వామ్య సదస్సు నుంచి రేమాండ్ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అలాగే శ్రీసిటీలోని ఏర్పాటైన 5 కంపెనీలను ప్రారంభించారు. దీంతోపాటే... శ్రీసిటీలో కంపెనీలను ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ “భారత దేశంలో అత్యుత్తమ పారిశ్రామిక టౌన్ షిప్ శ్రీసిటి. శ్రీసిటి నుంచే డైకెన్, ఇసుజూ, క్యాడ్బరీ లాంటి ప్రముఖ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నాయి. వివిధ దేశాలకు చెందిన పరిశ్రమలు ఈ శ్రీసిటీ పారిశ్రామిక టౌన్ షిప్‌కు రావాలి. ఇప్పటికే బెల్జియం, జపాన్, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు చెందిన హెల్త్ కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్, మెడికల్ డివైసెస్ కంపెనీలకు రూ. 8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులిచ్చాం. గడచిన రెండు రోజులుగా రూ. 13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. మొత్తంగా గడచిన 18 నెలల్లోనే రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. త్వరలోనే శ్రీసిటీకి 6 వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తాం. 50 దేశాలకు పైగా కంపెనీలు శ్రీసిటీ నుంచి పనిచేస్తాయి. 1.50 లక్షల మంది ఉద్యోగాలతో శ్రీ సిటీ అభివృద్ధి మోడల్‌గా మారుతుంది. శ్రీసిటీ సమీపంలోనే ఎయిర్ స్ట్రిప్ నిర్మించే దిశగా ఆలోచన చేస్తున్నాం. ఉద్యోగ ఉపాధి అవకాశాలకు శ్రీ సిటీ తరహా మోడల్స్ మరిన్ని రావాల్సి ఉంది. ఒక సంస్థ తయారు చేసిన ఉత్పత్తులు మరో సంస్థకు ముడిసరుకుగా మారతాయి.

దీంతో ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే తొలిసారిగా ఏపీ ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తోంది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు భారీ ప్రణాళికలు వేస్తున్నాం. 2028 నాటికి శ్రీ సిటీని ఓ బెస్ట్ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తాం.”అని ముఖ్యమంత్రి అన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఆలిండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ స్టేడియం

**- మంత్రి లోకేష్‌తో ఎఐఎఫ్ఎఫ్ ఛైర్మన్ కళ్యాణ్ చౌబే భేటీ**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో ఆలిండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ (AIFF) ఛైర్మన్ కళ్యాణ్ చౌబే భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటీవల డిఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో 3 శాతం రిజర్వేషన్ అమలుచేశామని తెలిపారు. ఈ సందర్భంగా చౌబే మాట్లాడుతూ అమరావతిలో 12 ఎకరాల్లో AIFF ఫుట్‌బాల్ స్టేడియం నిర్మించనున్నట్లు చెప్పారు. గ్రాస్ రూట్స్ ఫుట్‌బాల్ సాధికారత కోసం పిఇటిలకు ఫుట్‌బాల్ శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖతో AIFF భాగస్వామ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎపిలో ఫుట్‌బాల్ శిక్షకులను గ్రేడ్ చేయడం, వారి సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఎఐఎఫ్ఎఫ్ క్రియాశీలకం వ్యవహరిస్తున్నట్లు చౌబే చెప్పారు.

## శ్రీకాకుళం ఎయిర్ పోర్టు నిర్మాణానికి రంగం సిద్ధం

**- ముందుకొచ్చిన ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా**

**- సీఎం చంద్రబాబు సమక్షంలో కుదిరిన ఎంఓయూ**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్రకు మరో ఎయిర్ పోర్టు రానుంది. శ్రీకాకుళంలో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు సంబంధించి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఎయిర్ పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మధ్య ఈ మేరకు అవగాహనా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో అధికారులు ఎంఓయూ పత్రాలు మార్చుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు ఎయిర్ పోర్ట్ రాకతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో కనెక్టివిటీ పెరుగుతుందని, అలాగే పర్యాటక రంగానికి దోహద పడుతుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అన్నారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధికి ఊతం లభిస్తుందని సీఎం అన్నారు. ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రస్తుతం స్థల



పరిశీలన జరుగుతోంది. మౌలిక వసతులు, రెగ్యులేటరీ అనుమతులపై ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఏపీ ఎయిర్ పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కలిసి పనిచేయనున్నాయి.

## విశాఖ - 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో సీఎం చంద్రబాబు సమక్షంలో 48 ఎంఓయూలు









**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రూ. 48,430 కోట్ల పెట్టుబడులు, తద్వారా 94,155 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం. ఎంఓయూల కార్యక్రమానికి హాజరైన మంత్రులు కందుల దుర్గేష్, టీజీ భరత్, సవిత, సీఎస్ విజయానంద్.

అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు సంబంధించి రూ. 1,980 కోట్ల ఒప్పందం. వైద్యారోగ్యం, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్ర మలు, టెక్స్ టైల్స్, పర్యాటక రంగాల్లో 48 ఒప్పందాలు.

ఎయిర్ పోర్ట్స్ అథారిటీ, హెట్రోడ్రగ్స్, భారత్ డైనమిక్స్ , జేకే ఏరోస్పేస్, అదాని విల్మర్, ఎన్ఎస్ టీఎల్ క్వాంటం కంప్యూటింగ్ స్టిములే టింగ్ సెంటర్, సిడాక్, పాస్కల్ తదితర సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు.

## కోర్డెలియా క్రూయిజెస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కోర్డెలియా క్రూయిజెస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ. ఆంధ్రప్రదేశ్ తీర పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని, ఇందుకు కోర్డెలియా క్రూయిజెస్ కలిసి రావాలని కోరిన సీఎం. విశాఖ-కాకినాడ-భీమునిపట్నం పోర్టుల నుంచి క్రూయిజ్ టూరిజం సేవలు అందించడంపై చర్చ. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్‌పై కోర్డెలియా క్రూయిజెస్ ఆసక్తి. భేటీలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, అధికారులు.

## వారు సమాజానికి అత్యంత ప్రమాదకరం - ప్లానెట్ కిల్లర్స్ బాగుంది

**అమరావతి, (రాజధాని వార్తలు):** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్లానెట్ కిల్లర్స్ డాక్యుమెంటరీపై ప్రశంసలు కురిపించారు. అడవిలో జరుగుతున్న దురాగతాలను ఈ డాక్యుమెంటరీ సమగ్రంగా వివరించిందని పేర్కొన్నారు. శేషాచలం అడవిని ఎలా నాశనం చేశారో అసాధారణంగా వివరించిందని, ఎర్రచందనం చెట్లను నరికి, అక్రమంగా రవాణా చేయడాన్ని ఎత్తి చూపిందని పేర్కొన్నారు. ‘ఎర్రచందనం మాఫియా వెనుక ఉన్న అంతర్జాతీయ కింగ్‌పిన్‌లను, జరిగిన క్రూరమైన హింసను, ఈ ప్రక్రియలో మనం కోల్పోయిన అటవీ అమరవీరులను ఈ డాక్యుమెంటరీ బహిర్గతం చేసింది. రాజకీయ ముసుగులు వేసుకుని ఎర్రచందనం నెట్‌వర్క్‌లో దాక్కున్న నేరస్థులు సమాజానికి అత్యంత ప్రమాదకరమైనవారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలి’ అని పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. స్మగ్లర్లతో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన కొందరు రాజకీయ నాయకులు ఎర్రచందనం అక్రమ రవాణాను తమ రాజకీయ కెరీర్‌కు ఇంధనంగా మార్చుకున్నారని పవన్ కల్యాణ్ విమర్శించారు. ఈ వాస్తవాలను ధైర్యంగా వెలుగులోకి తెచ్చి, శేషాచలం అడవిలో



జరిగిన క్రూరమైన విధ్వంసాన్ని చూపించినందుకు డాక్యుమెంటరీ రూపకర్తలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఓటమితో విచారం,విజయంతో అహంకారం ఉండదు.. తొలిసారి స్పందించిన ఆర్జేడీ

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రీయ జనతాదళ్ ఘోరమైన ఫలితాలను చవి చూడటంపై ఆ పార్టీ తొలిసారి స్పందించింది. నిరంతర ప్రజాసేవలో ఒడిదుడుకులు అనేవి అనివార్యమని పేర్కొంది. ఆర్జేడీ పేదల పార్టీ అని, పేదల మధ్యే ఉంటే వారి వాణి వినిపిస్తూనే ఉంటుందని సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో తెలిపింది. ‘ప్రజా సేవ ఒక నిరంతర ప్రక్రియ. ఇదొక నిరంతర ప్రయాణం. అందులో ఎత్తుపల్లాలు సహజం. ఓడిపోయినందుకు విచారం, గెలిచినందుకు అహంకారం ఉండదు’ అని ఆర్జేడీ పేర్కొంది. 243 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఆర్జేడీ కేవలం 25 సీట్లకే పరిమితమైంది. 2010 తర్వాత దారుణమైన ఫలితాలు వచ్చిన రెండో సందర్భం ఇది. అప్పటి ఎన్నికల్లో ఆర్జేడీ కేవలం 22 సీట్లు గెలుచుకుంది.

అతిపెద్ద పార్టీ నుంచి ఆర్జేడీ 2020 ఎన్నికల్లో 75 సీట్లు గెలిచి సత్తా చాటుకుంది. అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా నిలిచింది. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఓటమిని చవి చూసినా 23 శాతం ఓటింగ్ షేర్‌తో అన్ని పార్టీల కంటే ముందుంది. ఓట్ షేర్‌లో అందరికంటే ముందున్నా అత్యధిక సీట్లు మాత్రం బీజేపీ, జేడీయూ ఎగరేసు కుపోయాయి.

# పేదల న్యాయానికి అంకితమైన సీనియర్ న్యాయవాది : ఉప్పలపాటి రమేష్

**- పేదల తరపున న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న సీనియర్ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ రాజు - న్యాయవాద వృత్తితో పాటు, ఆధ్యాత్మికతలోనూ తనదైన ముద్ర వేసుకున్న లాయర్ రమేష్ బాబు - నిరంతరం పేదవాడికి న్యాయం జరగాలనే తలంపుతో ఉండే రమేష్ బాబుకి జన్మదిన శుభాకాంక్షలు**






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఆయనకు న్యాయ వేదిక ఒక వృత్తి కాదు.ఒక బాధ్యత. ఒక ధర్మం. ఒక సేవ. ఎప్పుడైనా పేదవాడు, అసహాయుడు కోర్టు గుమ్మం తట్టితే...ముందుగా స్పందించే హృదయం ఆయనదే. పేదల కోసం వాదించడం వల్ల ఆర్థిక లాభాలు రాకపోయినా, ధనార్జనే పరమావధి కాకుండా న్యాయమే గెలిచి నిలవాలనే దృఢ సంకల్పంతో న్యాయవాద వృత్తిలోకి వచ్చిన రమేష్ బాబు. వారి కళ్లలో కనిపించే నమ్మకం, వారికి వచ్చిన న్యాయం, వారి కుటుంబాల్లో వెలిగే చిరునవ్వు – ఇవే ఆయనకు పెద్ద పారితోషికాలు. న్యాయవాద వృత్తి తో పాటు ఆధ్యాత్మికతలోనూ తనదైన ముద్ర వేసుకున్న రమేష్ బాబు చుట్టుపక్కల ప్రాంతాలలో ఏ దైవకార్యానికైనా తన వంతు సాయం చేస్తూ చేయూతనందించే వ్యక్తి. ఇలాంటి నిరాడంబర జీవి రమేష్ బాబు. నేటికీ 64 వసంతాలు పూర్తి చేసుకుని 65వ వసంతంలోకి అడుగు పెడుతున్న లాయర్ రమేష్ బాబుకి కుటుంబ సభ్యుల తరపున, శ్రేయోభిలాషుల తరపున, అభిమానుల తరపున జన్మదిన శుభాకాంక్షలు.

**న్యాయమంటే న్యాయం..**

అధికారులైనా, ధనవంతులైనా, గుంపులైనా ఎవరే ఎదురు నిలిచినా, పేదల హక్కుల కోసం ఆయన స్వరం ఎప్పుడూ వెను కడుగు వేయదు. ఈరోజు ఆయన జన్మదినం సందర్భంగా పేదల్లో విశ్వాసాన్ని నింపిన, న్యాయ వ్యవస్థలో నైతికతకు ప్రతీకగా నిలిచిన ఆయన సేవలకు మనస్ఫూర్తిగా వందనం. అలాంటి వ్యక్తిత్వం అందరికీ ఆదర్శం. ఆయన చిరునవ్వు మరింత మందికి ధైర్యం.

# నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్ ఉచిత వైద్య శిబిరం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 11 వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ మూడు జెండాల సెంటర్ పార్క్ నందు మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో నారాయణ హాస్పిటల్ ఆన్ విల్స్ మీ ఇంటి వద్దకే ఉచిత వైద్య శిబిరం నిర్వహించడమైనది.ఈ కార్యక్రమానికి 11వ డివిజన్ టిడిపి అధ్యక్షులు గొడ్డేటి.నాగేంద్ర పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మంత్రి నారాయణ ప్రజల ఆరోగ్యం,సంక్షేమం కొరకు నిరంతరం పనిచేస్తూ ముందుకు పోతున్నారని నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఉచితము వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో ఎక్సరే, ఈసీజీ, లేబోరేటరీ టెస్టులు, కంటి పరీక్షలు ఉచితంగా ఏర్పాటు చేసి ఉన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలతో పాటు క్యాన్సర్ పై అవగాహన, బీపీ, షుగర్ పరీక్షలు, నేత్ర సంబంధ వ్యాధులు, పారిశుద్ధ్య లోపం మరియు నీటి కలుషితం వలన కలుగు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 200 మంది పైగా ప్రజలు




ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోతం.బాలకృష్ణ,ఆవుల. శ్రీనివాసులు, ఎ.రామ్ బాబు,నారాయణ, ఎ.నాగార్జున, పి. రాజేశ్వరి, శ్రీకాంత్, జి.సాయి, పురం.రాంకీ, తోటకూర. చందు, సునీల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలి

**- పిడిఎస్ఓ ఏరియా మహాసభ డిమాండ్**

**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** పిడిఎస్ఓ ఏరియా మహాసభ పట్టణంలోని పింజల వీరయ్య కళ్యాణ మండపంలో జరిగింది. పిడిఎస్ఓ నాయకులు సిహెచ్ పవన్ అధ్యక్షతన మహాసభ ప్రారంభమైంది. ప్రధాన వక్తగా పాల్గొన్న ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు మాట్లా డుతూ "ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం విద్యను వ్యాపారంగా మార్చే కుట్ర. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుకొండ, పాలకొల్లు, అమలా పురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలను 33 సంవత్సరాల లీజుకు ఇవ్వడం ద్వారా 1500 ఎంబీబీఎస్ సీట్లు ప్రభావితమవుతున్నాయి. రిజర్వేషన్లు తగ్గి, ఫీజులు అమాంతం పెరుగుతున్నాయి. ఇది పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందని ద్రాక్షగా మారుస్తోంది. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించి, జీవో 107, 108లను రద్దు చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు. బ్రిటిష్ దొరల నుంచి అధికారం తీసుకుని 75 ఏళ్లు దాటిపోయినప్పటికీ అందరికీ విద్య, వైద్యం ఉపాధి నేటికీ అందక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నామని దుయ్యబట్టారు. వైద్య కళాశాలల పిపిపి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర నాయకులు కె. అజిత మాట్లాడుతూ అశాస్త్రీయ విద్యా విధానం, నిరుద్యోగం, మత్తు పదార్థాల వ్యసనం, అశ్లీల సంస్కృతి కలిసి యువతను దారి తప్పిస్తున్నాయని, విద్యార్థులు నేడు సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని, దోపిడీని ప్రశ్నించకుండా, పోరాటాలు చేయకుండా ఉండటం కోసం పాలకులు ఉద్దేశపూర్వకంగానే మద్యం, మత్తు పదార్థాలను విష సంస్కృతిని యువతలో పెంచి పోషిస్తున్నారు. విద్యార్థులు వీటన్నింటిని నుండి బయటపడి విద్యా రంగ సమస్యల పరిష్కారం




కోసం, మంచి భవిష్యత్తు కోసం పోరాటం చేయాలని అన్నారు. తిరుపతి జిల్లా పిడిఎస్ఓ కార్యదర్శి ఆర్.ఆష మాట్లాడుతూ "జాతీయ విద్యా విధానం – 2020 ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా కార్పొరేటీకరించడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో విద్యా సంస్క రణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపరుస్తున్నారు. యువత నిరుద్యోగంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న ఈ పరిస్థితుల్లో విద్య, ఉపాధి హక్కుల కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాడాలి, పిడిఎస్ఓ విద్యార్థి సంఘంలో భాగస్వామ్యం అవ్వాలని అని అన్నారు. ఇంకా పల్లిపాటి రాజా తదితరులు మాట్లాడారు. ఈ మహాసభలో ఏర్పడిన ఏరియా కమిటీలో సిహెచ్.పవన్ కన్వీనర్‌గా, మనోజ్, తేజు, లక్ష్మి నరసింహ, శ్రీను, ప్రవళిక, దేవి, భవాని కమిటీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో 250 మంది విద్యార్థులు పాల్గొ న్నారు. ముందుగా విశ్వోదయ క్రీడా ప్రాంగణం నుంచి ప్రదర్శన ప్రారంభమై భ్రమరాంబా సెంటర్ మీదగా వెళ్లి తిరిగి పింజల వీరయ్య కళ్యాణ మండపానికి చేరుకున్నారు.

# కూటమి ప్రభుత్వంలో మెడికల్ కాలేజీలు నిర్వీర్యం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జి దవులూరి దొరబాబు విమర్శించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ సామర్లకోట 1, 2, 3, 4, 6 వార్డులకు సంబంధించి మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజస్ ఆధ్వర్యంలో వై ఆర్ ఎల్ కళాశాల సమీపంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు హాజరయ్యారు. ముందుగా డా. బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 12 కళాశాలలను నిర్మిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని ప్రైవేట్‌పరం చేసేందుకు చర్యలు తీసుకుంటుం దన్నారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయ కులు, రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజస్, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ చంటిబాబు, పట్టణ అధ్యక్షులు పాగా సురేష్ కుమార్, కౌన్సిలర్‌లు పిట్టా సత్యనారాయణ, రెడ్డి లోవకుమారి, పార్టీ నాయకులు మన్యం చంద్రరావు, రెడ్నం దొరబాబు, వేగు సత్తిబాబు, చిట్టిమాని శ్రీను, ఇరుసుమళ్ళ సాయి, తదితర వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవాలయాల వద్ద పటిష్ట ఏర్పాట్లు, భద్రత ఏర్పాటు చేయండి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** కార్తీక సోమవారం, సుబ్రహ్మణ్యేశ్వర షష్టి వంటి పర్వదినాల సందర్భంగా జిల్లాలో ప్రముఖ దేవాలయాలలో భక్తుల రద్దీ నియంత్రణ, దైవ దర్శనానికి క్యూలైన్ల ఏర్పాటు ద్వారా కంట్రోలింగ్, శాంతి భద్రతల పరిరక్షణ కొరకు పోలీసులు, రెవెన్యూ, వైద్యులు, వాలంటీర్ల సమన్వయంతో భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా పటిష్ట ఏర్పాట్లు, భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఆర్ మహేష్ కుమార్ శాంతి భద్రతల కమిటికి సూచించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా శాంతిభద్రతల కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో కార్తీకమాసం చివరి సోమవారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని శివాలయాలు వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ఈ నెల 26వ తేదీ సుబ్రహ్మణ్యేశ్వర షష్టి సందర్భంగా రాజోలు మండలం కడలి గ్రామం లో వేంచేసియున్న కపోతేశ్వర స్వామి ఆలయంలో షష్టి ఉత్సవాలు ఘనంగా నిర్వహించే అవకాశం ఉందని శాంతి భద్రతల పరిరక్షణ కమిటీ పూర్తి సమన్వయం వహించి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.భక్తులు భద్రత సురక్షితం, ఉత్సవాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తాకిడి ప్రదేశాల్లో ప్రమాదాలు, అవాంఛిత సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల రద్దీని నియంత్రించడం దేవాలయ ప్రవేశ ద్వారాల వద్ద సెక్యూరిటీ చెక్‌లు నిర్వహించడం చేపట్టాలన్నారు. పోలీసు బలగాలు, స్థానిక స్వయం సేవకులు, ప్రత్యేక సామాజిక తనిఖీ బృందాలతో కలిసి పనిచేయాలన్నారు. సీసీటీవీ కెమెరాలు, మెటల్ డిటెక్టర్‌లు, ఇతర సెక్యూరిటీ సాధనాలను వినియోగించాలన్నారు. ఇటీవల కాలంలో కాశీ బుగ్గలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచు కొని దేవాలయాల వద్ద భద్రతా చర్యలు బలోపేతం చేయాలన్నారు. ప్రమాదాలు లేదా అవాంఛిత సంఘటనలు జరిగితే వెంటనే స్పందించడానికి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజ లకు సూచనలు, సూచన బోర్డులు, మరియు ప్రచా రాల ద్వారా సురక్షితంగా ఉండాలని సూచించాలన్నారు. దేవాలయాల్లో ప్రత్యేక ప్రవేశ మార్గాలు, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయా లన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం మెడికల్ టీమ్‌లు, ఫస్ట్ ఎయిడ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య అధికారులు ఆదేశించారు. ప్రజల మధ్య సామాజిక శాంతి కోసం సంఘటనలు నివారణకు సంబంధించిన సూచనలు ఇవ్వడంతో పాటుగా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే స్పందించాలన్నారు. రద్దీ ఎక్కువగాఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బ్యారికేడ్లు ఏర్పాటు, క్యూ లైన్ వ్యవస్థను కఠినంగా అమలు చేయాలన్నారు. అవసరమైతే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు. అంబులెన్స్, ఫస్ట్ ఎయిడ్ వంటి వైద్య సేవలు సిద్ధం చేయాలన్నారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ జోన్లు.ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు నియామకం, వన్‌వే సిస్టమ్ అమలు చేయాలన్నారు. భక్తులకు సౌలభ్యం కోసం షటిల్ బస్ సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. త్రాగునీరు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యం కోసం సానిటేషన్ సిబ్బంది నియమించాలన్నారు. భక్తులకు సూచనలు ఇవ్వడానికి పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు మరియు సేవా సిబ్బంది ద్వారా గైడెన్స్ ఇవ్వాలన్నారు. అత్యవసర స్పందన ప్రణాళిక అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కె మాధవి, పి శ్రీకర్ డి అఖిల జిల్లా స్థాయి ఫీజు కమిటీ అధికారులు పాల్గొన్నారు.




# ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం, లాభదాయకం

**- రైతుల ఆదాయం పెంపొందేలా అవగాహన కలిగించాలి**

**- శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**






**విజయనగరం, (రాజధాని వార్తలు):** మన పూర్వీకులు మంచి భూములను మనకు ఇచ్చారని, వాటిని రసాయనాలతో నింపేసి మన తర్వాతి తరం వారికి అందిస్తున్నామని, భూమిలో సహజ సిద్ధంగా ఉన్న పోషకాలను నష్టపోకుండా, భూ సారాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తెలిపారు. సహజ ఎరువులను వినియోగించడం, ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యానికి, పర్యావరణానికి, నేలకు, రైతుకు లాభదాయకని పేర్కొన్నారు. స్థానిక యూత్ క్లబ్ లో ప్రకృతి వ్యవసాయం పై ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువై, వాటి అవశేషాలు మన ఆహారం ద్వారా మన శరీరం లోకి చేరుతున్నాయని, దానివలన పలు రకాల వ్యాధులకు మనం గురవుతున్నామని, అలాగే గాలి, నీరు కూడా కాలుష్యం అవుతున్నాయని వీటి మూలంగా కాన్సర్ కూడా ఎక్కువైందని అన్నారు. కనుక ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గించాలని అన్నారు. కూరగాయలకు మంచి మార్కెట్ ఉందని, భవిష్యత్తులో ఎక్కువ డిమాండ్ ఏర్పడుతుందని, మనకు దగ్గరలోనే ఉన్న విశాఖకు రవాణా చేయడం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చునని అన్నారు. అలాగే టమాట కర్నూల్ నుండి దిగుమతి చేసుకుంటున్నామని, కిలో 60 రూపాయల వరకు చెల్లిస్తున్నామని, మనమే ఆ పంటను వేస్తే కిలో 30 రూపాయలకే వస్తుందని, రైతుకు కూడా లాభం ఉంటుందని పేర్కొన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా కూదరగాయలు, ఆకు కూరలు, ఆయిల్ పామ్ వంటి పంటలు, సాగు చేయడం వలన వరి వలన పొందే ఆదాయం కన్నా అధికంగా ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు అందరు గ్రామాల్లో రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న రైతులతో కలెక్టర్ ముఖా ముఖి మాట్లాడారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు, ప్రకృతి వ్యవసాయం డి.డి. ఆనందరావు, ఏ.డి. ప్రకాష్, జిల్లా ఉద్యాన అధికారి చిట్టిబాబు, వ్యవసాయ ఏ.ఓ. లు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, నైతికత ఎంతో ముఖ్యం : మేజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో నేర్చుకున్న మంచి లక్షణాలు జీవితంలో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. భావి భారత పౌరులు మీరేనని, దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందన్నారు. తల్లిదండ్రుల తర్వాత విజ్ఞానాన్ని అందించే గురువే దైవ సమానులు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు సాయి శేఖర్, ఎస్.వాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి బాలలే - దేశ భవిష్యత్తు తారలు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నేటి బాలలే దేశ భవిష్యత్తుకు తారలుగా నిలుస్తారనీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. బాలల దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా జరుపుకునే బాలల దినోత్సవం విద్యార్థులు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపుతుందన్నారు. పిల్లలను నెహ్రూ ఎంతగానో ప్రేమించే వారన్నారు. అనంతరం ఆయన పాఠశాలలోని విద్యార్థులకు బిస్కెట్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఏ. పైడితల్లి, హిందీ



ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ముక్తేశ్వరి పాల్గొన్నారు.

# బాలికోన్నత పాఠశాలలో వేడుకగా "బాలల దినోత్సవం"




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం వేడుకగా జరిగింది. ముందుగా దివంగత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినిలు పలు సాంస్కృతిక కార్యక్రమాలకు చేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అలాగే సందేశాత్మక నాటికలు కూడా ప్రదర్శించారు. ఇదే విధంగా మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉదార స్వభావానికి నిలువెత్తు నిదర్శనం పివిజి రాజు

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** పూసపాటి విజయరామ గజపతిరాజు (పీవీజీ రాజు) విజయనగరం సంస్థానానికి చివరి మహారాజుగా, ఒక పార్లమెంటేరియన్‌గా, ప్రజా సేవకుడిగా, దాతగా ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆదర్స్ హిందీ ప్రేమి మండలి గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. పివిజి రాజు 30వ వర్ధంతి సందర్బంగా భీమిలి పాత బస్టాండ్ వద్ద ఉన్న పివిజి రాజు నిలువెత్తు విగ్రహానికి గంటా నూకరాజు, కృష్ణారావు, మాస్టర్ సంయుక్తంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్య, సామాజిక సంస్కరణలు మరియు ప్రజలకు చేసిన సేవలను నూకరాజు వివరించారు. దేశ వ్యాప్తం



గా ఉన్న 113 దేవాలయాలకు ధర్మకర్తగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్డులు పాల్గొన్నారు.

# టీడీపీ 3వ వార్డు అధ్యక్షులుగా గొలగాని నరేంద్ర





**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** జీవిఎంసీ 3వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గా సీనియర్ నాయకులు గొలగాని నరేంద్ర కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్బంగా సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం పరిధిలో నియోజకవర్గం శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రధాన కార్య దర్శిగా కనకల అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా వాడమొదల సత్యారావు, ప్రధాన కార్యదర్శిగా కనకల అప్పలనాయుడు, కోశాధికారిగా కంచర్ల కామేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జలగడుగుల మురళి, కార్య నిర్వాహక కార్యదర్శిగా నొల్లి చిన్న రమణ, రాజగిరి వెంకటరమణ, అప్పికొండ నూకరాజు, వియ్యపు పోతురాజు, శీరపు మహేష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్బంగా అధ్యక్షులు నరేంద్ర మాట్లాడుతూ వార్డులో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తూ చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు. అధ్యక్ష భాద్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులకు ఈ సందర్బంగా ఆయన ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేసారు.

# మక్కువలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు పురస్కరించుకొని ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవంబర్ 14 బాలల దినోత్సవం జరుపుకోవడం మన అందరి అదృష్టం అని ప్రధానోపాధ్యాయులు రోజా రాణి అన్నారు. పిల్లలు చదువులలో, ఆటలలో రాణించాలని క్రమశిక్షణతో ఉంటూ మంచి నడవడికతో సమాజానికి సేవ చేసే విధంగా నడుచుకోవాలని తెలిపారు.

నేటి బాలలే రేపటి పౌరులు అని ఈ సందర్భంగా బాలల దినోత్సవ సందర్భంగా పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులతో పాటు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు




**దుమ్ముగూడెం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం ప్రపంచ మధుమేహం వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు నర్సాపురం ప్రభుత్వ పీహెచ్సీ హాస్పిటల్ నందు హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా (ఎన్జీవో) డయాబెటిస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.మధువరన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ మధుమేహం (డయాబెటిస్) భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇది చిన్న పెద్ద తేడా లేకుండా మన శరీరంలో ఉత్పత్తి కాబడే ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోయినా లేదా ఉత్పత్తి కాబడిన ఇన్సులిన్ సరిగా పనిచేయకపోయినా అసలు మన శరీరంలో ఇన్సులిన్ పూర్తిస్థాయిలో ఉత్పత్తి కాకపోయినా ఈ డయాబెటిస్ వ్యాధి అనేది మనకు సంక్రమిస్తుంది. ఇది ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటుందని టైప్ వన్ చిన్న పిల్లలకు అంటే 25 సంవత్సరాలలోపు పిల్లలకు టైపు టు ఆపై పడిన వయసు వారికి మరియు గర్భిణీ స్త్రీలకు కూడా ఈ డయాబెటిస్ వ్యాధి ఈ ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడం వలన సంక్రమిస్తుందని, ఈ వ్యాధి లక్షణాలు అత్యధికంగా మూత్రం రావడం, విపరీతంగా ఆకలి వేయడం, ఎక్కువ దాహం వేయడం, చిన్న చిన్న గాయాలు కూడా మానకపోవడం, కంటి చూపు తగ్గడంలాంటివి ఇందులో ఎటువంటి లక్షణాలున్న పూర్తిస్థాయిలో పరీక్షలు చేయించుకుని ముందుగానే అప్రమత్తమే దీనికి తగిన ఆహార అలవాట్లను, వ్యాయామాన్ని చేసినట్లయితే ఈ వ్యాధిని కొంతవరకు పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని గ్రామస్తులకు ఈ అవగాహన కార్యక్రమంలో తెలియజేశారు. హ్యాండ్స్ ఇన్ హాండ్స్ (ఎన్జీవో) ఐటీసీ మిషన్ బంగారు భవిషత్ (ఐ టి సి మిషన్ సునెహ్రాకల్) సహకారంతో ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు గ్రామస్తులకు ఇటువంటి దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించి వారిని చైతన్య పరిచే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అనేది సంతోషకరమని, ఇకముందు కూడా ప్రజలలో దీర్ఘకాలిక వ్యాధుల పట్ల ఉన్న అపోహలను తొలగించి వాటి నియంత్రణకు అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్య పరచడానికి ఇటువంటి అనేక కార్యక్రమాలు చేపట్టాలని హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా (ఎన్జీవో) కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాక ఈ ఎన్జీవో ద్వారా నర్సాపురం ప్రభుత్వ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలకు గ్రామస్తులకు అత్యవసరమైన పబ్లిక్ టాయిలెట్ కట్టిస్తున్నారని మరియు హాస్పిటల్ కి కావలసిన మెడికల్ పరికరాలు అందించనున్నారని వారికి మా అందరి తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు డా. సుభాష్ (మెడికల్ ఆఫీసర్), హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా (ఎన్జీవో) నుండి సునీల్ (ప్రాజెక్ట్ మేనేజర్), ఎన్ సి డి కన్సల్టెంట్ డబ్ల్యూ హెచ్‌ఓ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నుండి బీ శ్రీకాంత్, వి. హరి కిషన్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క వెంకన్న బాబు జన్మదిన పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం





**ఎటపాక, (రాజధాని వార్తలు):** యటపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లయన్స్ క్లబ్ అఫ్ భద్రాద్రి జాటాయు చార్టర్ ప్రెసిడెంట్ నక్కా వెంకన్న జన్మదిన్నాని పురస్కరించుకొని ఈరోజు యటపాక లోని మైధిలి వనంలో రెడ్ క్రాస్ సొసైటీ మరియు గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ ఆధ్వర్యంలో మేఘా రక్తదాన శిభిరం ఏర్పాటు చేయటం జరిగింది.

ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది నక్కా వెంకన్న అభిమానులు, స్నేహితులు, యటపాక యూత్ సభ్యులు రక్తదానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్కా నరసింహారావు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైస్సార్సీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు గోసు ప్రశాంత్ (చింటు), కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైదిలి రెడ్డి, ముత్యాల వీరభద్రం, సూర్యనారాయణ, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, కొండెపు చెంచయ్య, జల్లారపు రవి, బర్ల కృష్ణ, కురినాల విజయ్ కుమార్, కురినాల అనిల్ కుమార్, వినయ్, సాయి, ఏరియా హాస్పిటల్ మరియు రెడ్ క్రాస్ సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, యటపాక యూత్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల భద్రాచలం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘనమైన విజయం పట్ల టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక తాత గుడి సెంటర్ నందు టపాసులు కాల్చి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడం పట్ల టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటం హర్షించదగ్గ విషయమని, ఈ విజయం ప్రజా విజయమని, ప్రతిపక్ష బి ఆర్ ఎస్ ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడిన ఈరోజు జూబ్లీహిల్స్ ప్రజలందరూ కూడా కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడ్డారని, 25 వేల మెజారిటీ ఇచ్చి నవీన్ యాదవ్‌ని జూబ్లీహిల్స్ ప్రజలు దీవించారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే గెలుపు పునరావృతం అవుతుందని ఆయన మాట్లాడారు. ఈ గెలుపు సంబరాలలో భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్డిపట్ల సత్య లింగం, రెడ్డి బత్తుల కృష్ణా రెడ్డి, ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, మైనార్టీ నాయకులు మహమ్మద్ జిందా, సేవాదళ్ మండలాధ్యక్షులు అశోక్, అర్జీ సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, ఐఎన్టియుసి నాయకులు మాగాపు రాజు, రాగం సుధాకర్, గౌతమ్, సాయిబాబా, సునీల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## నెహ్రూతో జరగని ఓ మాటా మంతీ

అమెరికన్ యువ రాజకీయవేత్త ఒకరు ఇటీవల జవాహర్‌లాల్ నెహ్రూ పేరును, ఆయన మాటలను స్ఫూర్తిదాయకంగా ప్రస్తావించారు. దశాబ్దాల క్రితం నెహ్రూ గురించి మరో యువ అమెరికన్ భావాలు, అభిప్రాయాలు జ్ఞాపకం చేసుకోవడం సందర్భోచితమే కాకుండా ఉపయోగకరంగానూ ఉంటుంది. ఈ యువ అమెరికన్ డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్. 1950వ దశకం తొలినాళ్లలో డాక్టొరల్ విద్యార్థిగా గాంధీ, భారత స్వాతంత్ర్యోద్యమం గురించిన పుస్తకాలను కింగ్ ఆబగా చదివారు. ఈ అధ్యయనాల సందర్భంగా గాంధీ సహచరుడు, ఆయన వారసుడు జవహర్‌లాల్ నెహ్రూ మానవీయ వ్యక్తిత్వం, మేధా ఔన్నత్యం ఆయనకు పరిచయమయ్యాయి. నెహ్రూ ఆత్మకథ, ఇతర పుస్తకాలు కూడా కింగ్ చదివారు. 1958 నవంబర్‌లో, మూడు పదుల వయసు కూడా లేని కింగ్ కొత్తగా ప్రచురితమైన తన పుస్తకం ‘Stride Toward Freedom’ ప్రతి నొకదాన్ని భారత ప్రధానమంత్రికి పంపించారు. అమెరికా పౌర హక్కుల ఉద్యమంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ‘మోంట్ గోమెరీ బస్ బాయ్‌కాట్’ సంఘటన పూర్వాపరాల గురించి కింగ్ పుస్తకం విపులంగా వివరించింది. నెహ్రూకు పంపిన ప్రతిపై కింగ్ ఇలా రాశారు: ‘విముక్తి ఉద్యమాల పట్ల మీ శ్రద్ధాసక్తులకు, అణగారిన ప్రజల పట్ల మీ మానవతావాద దృక్పథానికి, భారతదేశ స్వాతంత్ర్యానికి మీరు చేసిన మహోన్నత పోరాటం ద్వారా నాకూ, మోంట్ గోమెరేలోని యాభై వేలమంది నీగ్రోలకు మీరు ఇచ్చిన స్ఫూర్తికి కృతజ్ఞతగా’. కింగ్ సహృదయతకు నెహ్రూ వెన్వెంటనే ప్రతిస్పందించారు. కింగ్‌కు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు: ‘అమెరికాలో జాతి వివక్షను రూపుమాపేందుకు మీరు చేస్తున్న కృషి నాకు చాలాకాలం నుంచీ ఆసక్తిదాయకంగా ఉన్నది. ముఖ్యంగా మీరు మీ ఉద్యమాన్ని నిర్వహిస్తోన్న పద్ధతి నాకు మరింత ఉత్సుకత కలిగిస్తోంది. మీ కృషిపై మరింత మెరుగైన అవగాహనకు రావడానికి మీ పుస్తకం నాకు తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. మీరు త్వరలో భారత్ పర్యటనకు రానున్నారని తెలిసింది. న్యూఢిల్లీలో మిమ్ములను కలుసుకునేందుకు నేను సదా ఎదురు చూస్తుంటాను.’ కాకా కలేల్కర్, రాజకుమారి అమృత్ కౌర్ మొదలైన గాంధీజీ సహచరుల ఆహ్వానం మేరకు భారత్‌లో కింగ్ పర్యటించారు. తన సతీమణి కోరెట్టాతో పాటు 1959 ఫిబ్రవరి 10న ఆయన న్యూఢిల్లీకి వచ్చారు. విమానాశ్రయంలో దిగగానే తనను కలవ వచ్చిన విలేఖర్లకు ఆయన ముందుగా సిద్ధం చేసుకున్న ఒక ప్రకటనను చదివి విన్పించారు: ‘స్నేహితుల్లారా, చాలాకాలంగా మీ మహోన్నత ప్రియధాత్రిని సందర్శించేందుకు ఎదురు చూస్తున్నాను. ఇతర దేశాలకు నేను ఒక పర్యాటకుడిగా మాత్రమే వెళతాను. అయితే భారత్‌కు మాత్రం ఒక యాత్రికుడిగా వచ్చాను. ఎందుకంటే భారత్ అంటే నాకు గాంధీ భూమి. ఆయన సార్వకాలిక మహాత్ముడు. నాకు భారత్ అంటే పండిట్ నెహ్రూ కూడా. ఆయన రాజనీతిజ్ఞత, మేధా వ్యక్తిత్వం ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతి పొందుతున్నాయి’. ఫిబ్రవరి 13న తీన్‌మూర్తి భవన్‌లో విందుకు కింగ్‌ను నెహ్రూ ఆహ్వానించారు. బోస్టన్ విశ్వవిద్యాలయంలో కింగ్ పేపర్స్‌ను నేను అధ్యయనం చేస్తుండగా టైప్ చేసిన ఒక డాక్యుమెంట్ నా దృష్టికి వచ్చింది. నెహ్రూతో భేటీలో కింగ్ ప్రస్తావించదలుచుకున్న విషయాల వివరాలు అందులో ఉన్నాయి. ఇవీ ఆ అంశాలు: (1) దేశీయ సమస్యలకు మాత్రమే కాకుండా అంతర్జాతీయ సంబంధాలలోనూ అహింసాయుతమైన సామాజిక పరివర్తనకు దోహదం చేసే గాంధేయ సూత్రాల ప్రస్తుత ప్రాధాన్యం, ప్రాసంగికత ఏమిటి?బీ (2) భారత ప్రజల సంక్షేమాన్ని ఇతోధికం చేసేందుకు ప్రస్తుతం జరుగుతున్న కృషిలో గాంధేయ పద్ధతుల ప్రాముఖ్యత, సామాజిక ప్రయోజనమేమిటి? గాంధేయ పద్ధతులలో ఎటువంటి మార్పులు అవసరం? దేశ రక్షణ, పారిశ్రామికీకరణతో అవి ఘర్షిస్తున్నాయా? (3) ప్రజాస్వామ్యాన్ని ప్రజలు తిరస్కరించనవసరం లేకుండా ఒక ప్రజాస్వామ్య దేశం తన ప్రజల శ్రేయస్సును వేగవంతంగా సాధించగలదా? ప్రజా సంక్షేమ సాధనలో చైనా లేదా భారత్ మార్గాలలో ఏది ఆదర్శవంతమైనది? ఆఫ్రికా ఏ మార్గంలో ముందుకు సాగాలి?బీ (4) భారత ప్రజలు, అమెరికాలోని నల్లజాతి ప్రజల మధ్య స్నేహ సంబంధాలను మరింతగా దృఢతరం చేయడమెలా? వంటివి. జ్ఞాపకానికి రాసుకున్న ఆ పత్రంపై కింగ్ సంతకం లేదు. అయితే అది తప్పకుండా ఆయన రాసుకున్నదే అయివుంటుంది. విందులో అతిథులు చాలామంది ఉండడం వల్ల నెహ్రూ-కింగ్ మధ్య వ్యక్తిగత భేటీకి ఆస్కారం లేకపోయింది. కింగ్ దంపతులు మూడు వారాల పాటు దేశవ్యాప్తంగా పర్యటించారు. కలకత్తా, పట్నా, మద్రాసు, బొంబాయి ప్రాంతాలను సందర్శించి విద్యావేత్తలు, ప్రజాహిత క్రియాశీలురు, గాంధేయవాదులతో సంభాషణలు జరిపారు. సబర్మతి, సేవాగ్రామ్ ఆశ్రమాలను సందర్శించి, గాంధీ స్మృతికి ఘనంగా నివాళులర్పించారు. కింగ్ దంపతులు ఢిల్లీకి తిరిగివచ్చిన తరువాత ‘గాంధీ పీస్ ఫౌండేషన్’ ఛైర్మన్ జి.రామచంద్రన్ వారి గౌరవార్థం విందు ఇచ్చారు. ఆ విందుకు ప్రధాని నెహ్రూను కూడా ఆహ్వానించారు. అయితే ఆ రోజున తాను రాజధానిలో ఉండలేక పోతున్నందుకు విచారం వ్యక్తం చేస్తూ శ్వేత, నల్లజాతి ప్రజల మధ్య సామరస్యానికి డాక్టర్ మార్టిన్ లూథర్‌కింగ్ ప్రశస్త కృషికి గాను ఆయనను అభినందించేందుకు ఆరాట పడుతున్నానని, కింగ్ దంపతులను కలుసుకోవడం తనకు అమిత ఆనందాన్నిస్తున్నదని రామచంద్రన్‌కు రాసిన లేఖలో నెహ్రూ పేర్కొన్నారు. అమెరికాకు తిరిగి వెళ్లిన తరువాత మార్టిన్ లూథర్‌కింగ్‌ను విశేష ప్రజాదరణ ఉన్న కెనడియన్ టీవీ కార్యక్రమం ‘ఫ్రంట్ పేజ్ ఛాలెంజ్’లో ఇంటర్వ్యూ చేశారు. ‘గాంధీకి మీరు ఏ విధంగా రుణపడి ఉన్నారని’ ప్రశ్నించగా ‘భారతీయ మహానాయకుడు తనకు నిస్సందేహంగా ఒక గొప్ప స్ఫూర్తి అని, అయితే జీసస్ నుంచి కూడా ఉత్తేజం పొందానని’ కింగ్ చెప్పారు.

# రైతు ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కలిగించాలి

### - ఉద్యాన పంటల పై దృష్టి పెట్టాలి - గంట్యాడ, బొండపల్లి మండలాల్లో క్షేత్ర స్థాయి పర్యటనలు చేసిన కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** రైతులు పండించే పంటకు మార్కెట్ సౌకర్యం లేకుంటే రైతు ఇబ్బంది పడతారని, పంటను విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలని వ్యవసాయ అధికారులకు కలెక్టర్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి గంట్యాడ, బొండపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటించి మామిడి, టమాట, రైతులు పండిస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని, ఉద్యాన పంటలను సందర్శించారు. కోటారుబిల్లి గ్రామంలో ఈ- పంట సూపర్ చెక్‌లో భాగంగా నమోదును పరిశీలించారు. వరి, మామిడి పొలాలను సందర్శించి, ఈ - పంట నమోదు పై సంతృప్తిని వ్యక్తం చేసారు. అదేవిధంగా రైతులతో మాట్లాడి వరి, మామిడి పంట విషయంలో ఉన్న ఇబ్బందులను గురించి చర్చించారు. కొండతామరాపల్లిలో టమాటా పంటను పరిశీలించారు. వరి పంటలో రైతులకు నికర ఆదాయం తక్కువగా ఉన్నందున ఉద్యాన పంటల వైపు మళ్ళించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. తదుపరి కొవ్వాడలో సాగు అవుతున్న ప్రకృతి సేద్యం రైతుల పొలాలను పరిశీలించారు.

ప్రధానంగా మార్కెటింగ్ సదుపాయం పై దృష్టి పెట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రజలందరికి ఆరోగ్యకరమైన ఆహారం తినడంపై అవగాహన పెరిగిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేసేలా అవగాహనా కలిగించాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, ఉద్యాన అధికారి చిట్టిబాబు, ఇతర వ్యవసాయ, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు






**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా ఐఏఎస్ వారు గౌరవ అతిధిగా పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా 14-11-2025 వ తేదీన ప్రారంభ వేడుకలలో భాగంగా మొదటిరోజు బాలల దినోత్సవం సంధర్భముగా కార్యక్రమాన్ని గౌరవ అతిదులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంబించి జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గౌరవ కాకినాడ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా ఐఏఎస్ వారు మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పఠనాసక్తి పెంచుకోవాలని, మీరు చదివే తరగతి పుస్తకాలతో పాటు లోక జ్ఞానంపై ఔపోసన పట్టాలని, విజ్ఞానాన్ని పెంచుకోవాలని, వాటితో భవిష్యత్‌కు అవసరమయ్యే జ్ఞాన సముపార్జనకు పునాదులు వేసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియలా కొనసాగించాలన్నారు. అలాగే గ్రంథాలయాలలో అన్ని రకాల విజ్ఞాన పుస్తకాలు లభిస్తాయని, ఏదైనా ఒక వస్తువు తయారీ విధానం గురించి గాని, గతంలో జరిగిన సామాజిక చరిత్ర గురించి గాని, ఎవరైనా గొప్ప వ్యక్తి గురించి పుస్తకం వ్రాయబడి ఉంటే అది కచ్చితంగా గ్రంధాలయంలో ఉంటుందన్నారు. మార్కెట్ కమిటీ అద్యక్షులు బచ్చు శేఖర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదతో పాటు మానసికాభివృద్ధి పెరుగుతుందని మన పూర్వీకులు ప్రగాఢంగా విశ్వసించేవారని, పుస్తకాలు జ్ఞాన భాండాగారాలైనప్పటికీ అన్ని పుస్తకాలను వ్యక్తి గతంగా సేకరించడం అధిక ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి ఇందుకు చక్కటి పరిష్కారమే గ్రంథాలయమని కావున ప్రతి ఒక్క విద్యార్ధి విద్యార్థి దశ నుండే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కాకినాడ నగర టిడిపి అద్యక్షులు మల్లి పూడి వీరు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి వెంకట రమణయ్య నాంది పలుకగా పాతూరి నాగభూషణం దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి గ్రంథాలయాల ఏర్పాటు, కృషికి ఐదు దశాబ్దాల పాటు కృషి చేశారన్నారు. గ్రంథాలయ ఉద్యమం ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంతో సమాంతరంగా సాగిందన్నారు. స్వాతంత్ర్యం ఉద్యమాలకు గ్రంథాలయాలు నిలయాలుగా పని చేశాయన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పబ్లిక్ సర్వీసు కమిషన్, సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు సంబంధించినవి, ఎన్‌డిఏ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే సర్వీసు ఉద్యోగాలకు సంబంధించి అవసరమైన పుస్తకాలతో పాటు సాహిత్యం, సంస్కృతం, నవలలు, భక్తి, విద్య, ఆరోగ్యం, చరిత్ర తదితర రకాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, కావున గ్రంథాలయాలను అందరు వినియోగించుకొనవలసినదిగా కోరారు. ఈ సందర్భముగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న అన్ని శాఖ గ్రంథాలయాలలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు ఈ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ విశిష్టతను ప్రజలకు తెలియజేయడం కోసమే ఘనంగా నిర్వహించుట జరుగుచున్నదని, ఈ సందర్భముగా విద్యార్థిని విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలు నిర్వహించుట జరుగుచున్నదని, కావున విద్యార్థులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. మొదటి రోజు కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులు స్వాతంత్ర్యసమరయోధుల వేషధారణ పోటీలు నిర్వహించుట జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో వక్తలను అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ఇన్చార్జ్ కె.కిషోర్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎమ్.శ్రావ్య మరియు గ్రంథాలయ సిబ్బంది, ఎ.వి.ఎస్.నాగేంద్ర కుమార్, ఎన్.వి.ఎస్.ఫణీంధ్ర కుమార్, టి.వీర్రాజు, జి.దుర్గా ప్రసాద్, వి.అరుణ కార్యాలయ సిబ్బంది ఎస్.రాజు, టి.సాయి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# బాలల దినోత్సవం వేడుకలలో మన సిరమ్మ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా ధర్మపురి ప్రాంతంలోని సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మతో నేడు బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ధర్మపురి పరిసర గ్రామాల నుండి సుమారు రెండు వందల మంది బాలబాలికలు వచ్చి పాల్గొన్నారు. అనంతరం కేకు కటింగ్ చేసి చిన్నారులకు స్వయంగా కేకు అందించారు. పిల్లలతో సందడి నిండిన ఈ వేడుకల్లో వినోద కార్యక్రమాలు, ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పాల్గొన్న ప్రతి పిల్లవాడికి పుస్తకంలు, పెన్సిల్స్, కామ్పెస్ బాక్సు, స్కేల్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, క్రమ శిక్షణతో పెరిగే నేటి బాలలే రేపటి సమాజానికి మంచి పౌరులు అవుతారన్నారు. సమసమాజ నిర్మాణం కోసం బాలల పాత్ర ఎంతో కీలకం అన్నారు. బాలల హక్కులు, వారి భవిష్యత్తు నిర్మాణంలో విద్య ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం చివరిలో బాలబాలికలకు ఫలహారం స్వయంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హృద్రోగికి మందులు అందజేత



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పి 4 బంగారు కుటుంబం కార్యక్రమంలోభాగంగా సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలో పుప్పాల ఏగులమ్మ అను మహిళకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నెలవారీ సరిపడా మందులను శుక్రవారం అందజేశారు. గతంలో మాటిచ్చిన విధంగా పి4 కార్యక్రమంలో భాగంగా ఏగులమ్మ అనే మహిళకు ప్రతి నెల గుండెకు సంబంధించిన మందులను అపోలో ఫార్మసీ నుంచి తన సొంత ఖర్చులతో పంపిస్తామని ఎమ్మెల్యే చిన రాజప్ప ఇచ్చిన హామీ మేరకు మందులను పంచా యతీ కార్యాలయానికి పంపించగా గ్రామ పంచాయతీ సెక్రెటరీ, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, డాక్టర్ పార్దేశ్, వేట్లపాలెం వైద్య సిబ్బంది గ్రామ తెదేపా నాయకులు చల్లా బుజ్జి సమక్షంలో ఏగులమ్మ ఇంటి వద్దకు వెళ్లి మందులు అందజేశారు. ప్రతినెలా అపోలో నుంచి మందులను పంపిస్తున్న ఎమ్మెల్యే చిన రాజప్పకు ఈ సందర్బంగా ఏగులమ్మ కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ ఆరోపణలు అసత్యాలు : జమ్మలమడక నాగమణి



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలపై ఉద్దేశ పూర్వకంగా ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రస్థాయిలో స్పందించారు. వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అప్రామాణిక వ్యాఖ్యలు చేస్తూ అనవసరపు హడావుడి సృష్టిస్తున్నారని ఆమె డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. పెద్దిరెడ్డి కబ్జా చేశారని చెబుతున్న భూములు వాస్తవానికి ఆయనకే చెందినవని, దీనిని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ చలపతిరావు కూడా స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 1968 గెజిట్ రికార్డుల్లోని సర్వే నెంబర్లు 295, 296 కూడా పెద్దిరెడ్డి యాజమాన్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని తెలిపారు. ఇంకా సందేహం ఉన్న పవన్ కళ్యాణ్ కోసం డెహ్రాడూన్ అటవీ శాఖ మ్యాప్‌లు తెప్పించుకోవచ్చని వ్యంగ్యంగా సూచించారు నాగమణి. ఒకప్పుడు ఉమ్మడి ఏపిలో అటవీ శాఖ మంత్రిగా పని చేసిన పెద్దిరెడ్డి, శంషాబాద్‌లోని 450 ఎకరాల అటవీ భూమిని ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాపాడిన నేత అని ఆమె గుర్తు చేశారు. రెండుసార్లు ఆ శాఖకు మంత్రి కావడం ద్వారా ఆ బాధ్యతకు ఆయన మరింత గౌరవం తీసుకొచ్చారని పేర్కొన్నారు. చంద్రబాబు కోరికల కోసం పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి వంటి నేతలను టార్గెట్ చేయడం పవన్ కళ్యాణ్‌కు తగదని హెచ్చరించిన ఆమె, “రెండు లక్షల పుస్తకాలు చది వానని చెప్పే పవన్ కళ్యాణ్, అసత్య ఆరోపణలు చేయడానికి బదులు అటవీ, రెవెన్యూ చట్టాలు ఒక్కసారి చదవాలి” అని వ్యాఖ్యానించారు. హెలికాప్టర్లు, విమానాలలో పర్యటిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రచారం మొదలుపెట్టిన వ్యక్తి పవనే అని ఆమె ఆరోపించారు.

# కరపలో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

### - ఎనిమిది మంది అరెస్ట్ - రూ.38,000 స్వాధీనం



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలో అనధికార పేకాట కార్యకలాపాలపై పోలీసులు దాడులు వేగవంతం చేశారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో అందిన విశ్వసనీయ సమాచారంపై, సబ్ ఇన్స్పెక్టర్ తోట సునీత ఆధ్వర్యంలోని ప్రత్యేక దళాలు జెడ్. భావారం గ్రామ శివారులోని సపోటా తోటలో ఏర్పాటు చేసిన ఒక పెంకె ఇంటిపై దాడి నిర్వహించాయి. రైడ్ సమయంలో అక్కడ సాగుతున్న పేకాట శిబిరంలో ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.38,000 నగదు,104 పేకాట ముక్కలు స్వాధీనం చేసినట్లు పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మండలంలో పేకాట, కోడిపందాలు, గుండాటలు, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘాను మరింత కఠినతరం చేసినట్లు ఎస్ఐ సునీత పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఆమె వెల్లడించారు.


# అన్నీ తెలుసనుకుంటే పప్పులో కాలేసినట్లే!



అన్నీ నాకే తెలుసు..నాకు తెలియంది ఏం లేదు. ప్రపంచమే నన్ను చూసి నేర్చుకుంటుందని కొందరు అతి నమ్మకాన్ని ప్రదర్శిస్తుంటారు. తెలిసింది గోరంత అయినా కొండత తెలిసినట్లు అతిగా మాట్లాడుతుంటారు. తాజాగా అలాంటి వారిని ఉద్దేశించి బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. అన్నీ తెలుసని అనుకున్న రోజే తమకు అదే చివరి రోజు అవుతుందని అభిప్రాయపడింది. 'కొందరు తమని తప్పు అంటే ఎంత మాత్రం ఒప్పుకోరు. తామే రైట్ అని బుకాయిస్తారు? చేసిన పని తప్పు అని ఒప్పుకోవడానికి వాళ్లకి ఎంత మాత్రం మనసు రాదు. జీవితంలో ప్రతీ దశకు వర్తింపు: తప్పును స్వీకరించడంలో తప్పముంది? నేనెప్పుడు తప్పుడు, వైఫల్యాల గురించి భయపడను.తప్పులు చేయడం ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. చేసిన తప్పును మళ్లీ చేయకుండా జాగ్రత్త పడతాం. పిల్లలకు కూడా అంతే నడిచే వయసులో పిల్లలు చాలాసార్లు కింద పడతారు. అలా పడినప్పుడే మళ్లీ లేచి ఎంత బలంగా నడవగలం అన్నది వాళ్లకీ అర్థమవుతుంది. కింద పడ్డామని భయపడి పైకి లేవడం మానేయరుగా. ఆ క్షణానికి భయపడినా తగిలిన గాయం మానిన తర్వాత మళ్లీ లేచి నడక మొదలు పెడతారు. అందుకే జీవితంలో ప్రతీ దశకు, ప్రతీ వృత్తికి ఇది వర్తిస్తుందని నేను నమ్ముతాను. వారికెందుకో మనసు రాదు: కొన్నిసార్లు తప్పులు కూడా మంచి చేస్తాయన్నారు. 'ఈ విషయాన్ని అనుభవపూర్వకంగానే తెలుసుకున్నాను. చాలా మంది ఫలానా పని చేసి తప్పు చేసామని ఆక్షణంలో బాధపడినా? తర్వాత అదే రైట్ అవు తుందన్నారు. 'నటిగా రకరకాల పరిశ్రమల్లో పని చేసాను. ఎంతో మంది భిన్నమైన వ్యక్తులను కలిసాను. అక్కడ సం స్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకున్నాను. వాళ్ల దగ్గరకు వెళ్లి అక్కడ నేనే కెరెక్ట్ అని మొండిగా మాట్లాడటం అన్నది మూర్ఖత్వం అవుతుంది. కొందరు మనుషులు ఇదే తీరులో కనిపిస్తారు. చేసిన పని తప్పు అయినా? దాన్ని అంగీకరించడానికి మనసు మాదన్నారు. రేసులో ఇంకా వెనుకబడే: అలాంటి వారి విషయంలో చెప్పే ప్రయత్నం చేస్తాను. మారక పోతే వారి ఖర్మ అని వదిలేస్తాను' అని తెలిపింది.ఇక సోనాక్షి సినిమాల విషయానికి వస్తే ఇటీవలే అమ్మడు టాలీవుడ్‌లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. సుధీర్ బాబు హీరోగా నటించిన 'జటాధర' సినిమాలో ఓ కీలక పాత్ర పోషించింది. అమ్మడి పాత్రకు మంచి గుర్తింపు దక్కింది. మరి ఆ గుర్తింపుతో తెలుగులో కొత్త అవకాశాలు అందుకుంటుందేమో చూడాలి. ప్రస్తుతం బాలీవుడ్ లో మాత్రం నటిగా బిజీగా ఉంది. అయితే సోనాక్షి నటిగా ప్రయాణం ప్రారంభించి చాలా కాలమవు తున్నా ఇంకా స్టార్ లీగ్‌లో మాత్రం చేరలేదు. ఓ పెద్ద సినీ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చినా సోనాక్షి రేసులో వెనుకబడిన మాట మాత్రం వాస్తవం.

# ముంబైలో రూ. 252 కోట్ల డ్రగ్స్ రాకెట్.. లిస్టులో బాలీవుడ్ హీరోయిన్ల పేర్లు?






ముంబై పోలీస్ వర్గాలు ఇప్పుడు ఒక భారీ డ్రగ్ రాకెట్ గుట్టు రట్టు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది సుమారు రూ. 252 కోట్లకు పైగా విలువైన వ్యవహారమని, దీని మూలాలు అండర్‌వరల్డ్ వరకు పాకి ఉండవచ్చని కథనాలు వస్తున్నాయి. ఈ కేసు దర్యాప్తులో ఇప్పుడు కొందరి ప్రముఖుల పేర్లు కూడా వినిపిస్తుండటం బాలీవుడ్‌లో కలకలం రేపుతోంది. బాలీవుడ్ మీడియా రిపోర్ట్స్ ప్రకారం, ఈ డ్రగ్ రాకెట్‌కు సంబంధించి జరిగిన పార్టీలలో పలువురు సెలబ్రిటీలు పాల్గొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ లిస్ట్‌లో స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్, ప్రముఖ డాన్సర్ నోరా ఫతేహి పేర్లు ఉన్నట్లు జాతీయ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు శ్రద్ధా సోదరుడు సిద్ధాంత్ కపూర్, సోషల్ మీడియా స్టార్ ఓర్రీ, దర్శకులు అబ్బాస్ మస్తాన్, రాజకీయ నాయకుడి కుమారుడు జీషాన్ సిద్దిఖీ పేర్లు కూడా నార్త్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈ రాకెట్‌కు సంబంధించి ముంబై, దుబాయ్‌లలో భారీ పార్టీలు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పార్టీలను మహమ్మద్ సలీం సుహైల్ షేక్ అనే వ్యక్తి నిర్వహించినట్లు సమాచారం. ఇతను అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీం డోలాకు అత్యంత సన్నిహితుడని రిపోర్ట్స్ చెబుతున్నాయి. ఈ కేసులో మరో కీలకమైన కోణం కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్ కుమారుడు అలిష్ పార్కర్ కూడా ఈ పార్టీలకు హాజరైనట్లు వార్తలు వస్తున్నాయి. సరిగ్గా ఇక్కడే శ్రద్ధా కపూర్ పేరు బలంగా వినిపించడానికి మరో కారణం కూడా ఉంది. గతంలో హసీనా పార్కర్ బయోపిక్‌లో శ్రద్ధా కపూరే ప్రధాన పాత్ర పోషించడం గమనార్హం. అయితే, ఈ వార్తలు బయటకు వచ్చిన వెంటనే నటి నోరా ఫతేహి తీవ్రంగా స్పందించారు.

తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా ఈ ఆరోపణలన్నింటినీ ఖండించారు. ఈ కథనాల్లో ఎలాంటి నిజం లేదని, తన పేరును అనవసరంగా ఈ వివాదంలోకి లాగుతున్నారని ఆమె మండిపడ్డారు. ప్రస్తుతానికి, ఈ కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని అధికారులు చెబుతున్నట్లు సమాచారం. ఇప్పుడే పేర్లను ధృవీకరించలేమని, అయితే అవసరాన్ని బట్టి, ఆరోపణలు ఎదుర్కొంటున్న సెలబ్రిటీలను విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో, ఈ ప్రచారంలో నిజమెంత అనేది తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.


# కత్రినతో డేటింగుకి ముందు తెరవెనక కథ



కొన్ని పరిచయాలు గమ్మత్తుగా మొదలవుతాయి. ఆ తర్వాత అవి పెనవేసుకుపోయే బంధాలుగా మారతాయి. ముందు ప్రేమ పుట్టుకు వస్తుంది. ఆ తర్వాత మోహమో వ్యామోహమో మొత్తానికి ఆ ఇద్దరినీ కలుపుతుంది. చివరికి పెళ్లితో ప్రేమకథ సుఖాంతం అవుతుంది.. ఆ తర్వాత పిల్లలు కెరీర్ సాగే జీవితం ఇదంతా మామూలు విషయమే. ఇప్పుడు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినతో పరిచయం ఎలా మొదలైందో చెప్పుకొచ్చాడు విక్కీ కౌశల్. ప్రారంభం ఓ అవార్డుల కార్యక్రమంలో వేదికపై కత్రిన పరిచయం అయింది. ఇద్దరూ కలిసి చిక్నీ చమేలి! కి ఆడిపాడారు. ఆ తర్వాత తెరవెనక్కి వెళ్లగానే హోస్ట్ సునీల్ గ్రోవర్ తనకు కత్రినను పరిచయం చేసాడని విక్కీ చెప్పాడు. తరువాత వారు మళ్ళీ ఒక అవార్డు షోలో కలిశారు. సరదాగా సాగిపోయే అవార్డుల కార్యక్రమంలో హాస్యంలో భాగంగా విక్కీ వేదికపై కత్రినాకు ప్రపోజ్ చేశాడు. కత్రినా తనకంటే పెద్ద స్టార్ అవుతుందని విక్కీ కౌశల్ చెప్పాడు. నేను అవార్డు షోలో కలిసినప్పుడు తను షోను ఎలా హోస్ట్ చేయాలో చెప్పింది. అయితే అప్పటికే షో ముగిసింది. నేను చివరికి గుడ్ నైట్ చెప్పాను..! అని నాటి సంఘటనను గుర్తు చేసుకున్నాడు. అలాగే మొదటిసారి తనను హాయ్ కత్రిన అని పిలిచాను... తను కూడా హాయ్ విక్కీ అని పిలిచింది. ఆ తర్వాత ప్రేక్షకులను పట్టించుకోకుండా అవార్డుల షోను ఎలా హోస్ట్ చేయాలో నేర్పింది. కానీ అప్పటికే షోను పూర్తి చేసాను అన్నాడు. రెండవ అవార్డు షో సమయంలో కత్రినాను విక్కీ లాంటి మంచి వ్యక్తిని నువ్వు ఎందుకు పెళ్లి చేసుకోకూడదు? అని అడిగాను.

ఆ సమయానికి మేం డేటింగులో లేము.. నిజం ఏమిటంటే ఆ షోలో అది వేదికపై ఒక హాస్యం.. ఏ హీరోయిన్ వచ్చినా, నేను వారిని ఈ ప్రశ్న అడగాల్సి వచ్చింది. కాబట్టి షో జరిగిన ఆ రాత్రి నేను కత్రినాను అడగలేదు.. నేను చాలా మంది నటీమణులను అదే ప్రశ్న అడిగాను.. కానీ నేను, కత్రినా ఉన్న క్లిప్ మాత్రమే వైరల్ అయింది! అని విక్కీ కౌశల్ తెలిపాడు. చివరికి కత్రిన- విక్కీ కలిసి నటించారు. డేటింగ్ కూడా మొదలైంది. 9 డిసెంబర్ 2021న వివాహం చేసుకున్నారు. 7 నవంబర్ 2025న ఈ జంట తమ మొదటి బిడ్డకు జన్మనిచ్చారు. కత్రిన- విక్కీ అన్యోన్య దాంపత్యం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

# ఒక్క వీడియోతో సోషల్ మీడియా షేక్.. బ్యాక్ గ్రౌండ్ తెలిస్తే షాక్..



సోషల్ మీడియా ప్రభావం ఈ రోజుల్లో ఎక్కువగా ఉండటం వలన ఎవరు ఎప్పుడు ఎలా ఫేమస్ అవుతున్నారో ఎవరు ఊహించలేరు. ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్‌లో కొన్ని వీడియోస్ చూస్తున్నప్పుడు చాలా ఫన్నీగా కనిపిస్తాయి. అయితే ఆ వీడియోని చూసినప్పుడు చాలామంది ముందు నవ్వుకోవడం మొదలుపెడతారు. ఈ ప్రాసెస్లో కొంతమంది కామెంట్ కూడా చేస్తారు. అలా కామెంట్ చేయడం వలన ఆ వీడియోకి రీచ్ ఎక్కువగా వెళ్లి ఇంకో పదిమందికి కనిపిస్తుంది. మొత్తానికి ఏ అడ్రస్ లేని వాళ్ళు కూడా నేడు సెలబ్రిటీస్ అయిపోతున్నారు. అలానే సెలబ్రిటీస్‌గా కొన్ని సినిమాలు చేసిన వాళ్లు కూడా ఇప్పుడిప్పుడు ఫేమస్ అవుతున్నారు. ఎప్పటినుంచో ఇండస్ట్రీలో ఎన్నో సినిమాలు చేస్తూ కొంతమేరకు గుర్తింపు సాధించుకున్న వాళ్లు కూడా ఈ మధ్య విపరీతమైన గుర్తింపు దక్కించుకున్నారు. కారణం లేకుండానే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. అలా రీసెంట్ టైమ్స్‌లో వైరల్ అయ్యారు మరాఠీ నటి గిరిజ ఓక్. గిరిజ ఓక్ సోషల్ మీడియా షేక్ మరాఠీ నటి గిరిజ ఓక్ చాలా సినిమాల్లో కనిపించారు. అయితే ఆ సినిమాలేవి కూడా గిరిజ ఓక్ కు విపరీతమైన గుర్తింపును తీసుకురాలేదు. అమీర్‌ఖాన్ నటించిన తారా జమీన్ పర్ సినిమాలో కూడా ఈవిడ నటించారు. ఇక రీసెంట్ టైమ్స్‌లో గిరిజ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. గిరిజ వీడియో వైరల్ అవుతుంది అని బహుశా ఊహించుకోవడం ఉండదు. ఏకంగా గిరిజ కూడా ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రముఖ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన టీచర్ గురించి ఒక ఫన్నీ సంఘటనను షేర్ చేసింది. అలా షేర్ చేయటం అనేది బహుశా ఎవరికంటోపడి వీడియోను షేర్ చేయడం మొదలు పెట్టారు. ఆ తర్వాత ఈవిడ ఎవరు అని వెతుక్కుని మరి ఫోటోలు డౌన్లోడ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అక్కడితో సోషల్ మీడియానే ఈమె ఫోటోలు , వీడియోలు షేక్ చేస్తున్నాయి.. బ్యాక్ గ్రౌండ్ తెలిస్తే షాక్ గిరిజ ఎన్నో సినిమాలు చేశారు. అలానే తెలుగు నటుడు సందీప్ కిషన్ కీలక పాత్రలో నటించిన షోర్ ఇన్ ది సిటీ వంటి సినిమాలోనూ నటించింది. ఈ సినిమాలో సందీప్ కిషన్ తో ఈవిడకి ఒక లిప్ లాక్ సీన్ కూడా ఉంటుంది. ఇది కంటపడిన తర్వాత తెలుగు యువత ట్విట్టర్ లో దీనిని హైలెట్ చేయడం కూడా మొదలుపెట్టారు. అట్లీ దర్శకత్వంలో షారుఖ్ ఖాన్ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ జవాన్ లో కూడా కీలక పాత్రలో కనిపించారు. వెండితెరకే కాకుండా, బుల్లితెరపైనా గిరిజా కనిపిస్తూ తనకంటూ కొంతమంది అభిమానులను సొంతం చేసుకున్నారు.

అలానే కొన్ని వెబ్ సిరీస్ కూడా చేశారు. మొత్తానికి ఇప్పుడు ఈవెం పాపులర్ అవడం అనేది సడన్‌గా జరిగిపోయింది. ఇప్పుడు దీనిని పరిగణలోకి తీసుకొని తెలుగు ఫిలిం దర్శక నిర్మాతలు కూడా ఈవిడ డేట్లు పట్టుకొని సినిమాలు చేస్తారేమో చూడాలి.

# నగర ప్రజలకు,వాహన దారులకు బిగ్ అలెర్ట్

## - మరమ్మత్తులు కారణంగా ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఫ్లై ఓవర్ 16వ తేదీ నుండి మూసి వేయనున్నారు - సుమారు 45 రోజుల పాటు ఈ పనులు జరిగే అవకాశం ఉంది



**నెల్లూరు, (రాజధాని వార్తలు)::** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్, నెల్లూరు ట్రాఫిక్ విభాగం సిఐ రామకృష్ణలు విలేక రుల సమావేశం ఏర్పాటు చేసి కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం మాట్లాడారు. ఆత్మ కూరు బస్టాండు అండర్ బ్రిడ్జి మరమ్మతు పనులు, ఫ్లైఓవర్ పైన జాయింట్ల వద్ద రిపేర్లు తదితర నిర్మాణ పనులను ఈనెల 16వ తేదీ నుంచి చేపట్టి సుమారుగా 45 రోజులలో పూర్తి చేయనున్నామని తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, ఆర్ అండ్ బి విభాగం, నేషనల్ హైవే అథారిటీలు సంయుక్తంగా సమర్పించిన నివేదిక ఆధారంగా రాష్ట్ర పురపాలక శాఖ మాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశముల మేరకు ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, ఫ్లై ఓవర్ పైన 40 లక్షల రూపాయలతో నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారని కమిషనర్ తెలిపారు. అందుకుగాను ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ పైన ఆదివారం అర్ధరాత్రి నుంచి వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించామని వారు స్పష్టం చేశారు. వాహనాల ప్రయాణ మార్గాలను ప్రత్యామ్నాయ దిశలలో మళ్ళించి వాహన చోదకులకు అసౌకర్యం కలగకుండా మార్గాలను నిర్దేశించామని కమిషనర్ వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు నుంచి వచ్చే వాహన చోదకులు నూతన పెన్నా వారధి పైనుంచి లేదా సెట్టిగుంట రోడ్డు రైల్వే లైన్ ప్రాంతం నుంచి నగరంలోకి ప్రయాణించాలని, నవాబుపేట, బాలాజీ నగర్ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు విజయమహల్ గేటు లేదా రామలింగాపురం అండర్ బ్రిడ్జి మార్గాన్ని నగరంలోకి ఎంచుకోవాలని కమిషనర్, ట్రాఫిక్ సి.ఐ లు స్పష్టం చేశారు. కావున నెల్లూరు నగర ప్రజలంతా జరగనున్న అభివృద్ధి పనులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరులో బాలల దినోత్సవం సందర్భంగా "పార్కులో హెల్త్ ప్రోగ్రాం"


**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బాలల ఆరోగ్యం – ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పునాది. ఈ సందేశాన్ని మరింత బలపరచడానికి మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక పార్కులో ప్రత్యేక చిల్డ్రన్స్ హెల్త్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చిన్నారుల్లో హెల్త్ అవగాహన పెంచడం, తల్లిదండ్రులకు సరైన ఆరోగ్య సూచనలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. పిల్లలలో సాధారణంగా కనిపించే జ్వరం, అలర్జీలు, శ్వాస సమస్యలు, పోషకాహార లోపం, వ్యాక్సినేషన్ ప్రాముఖ్యత వంటి అంశాలపై మెడికవర్ పిల్లల వైద్య నిపుణులు వివరంగా అవగాహన కల్పించారు. పిల్లల కోసం ఫన్ గేమ్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ యాక్టివిటీలు, చిన్న హెల్త్ చెక్‌లు నిర్వహించడంతో చిన్నారుల్లో ఆనందం నిండింది. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు సీనియర్ పీడియాట్రిషన్ డాక్టర్ ఉదయ కీర్తి MBBS, Dch, IDPCCM మరియు డాక్టర్ వెంకట సురేష్ MBBS, DNB Neonatolog మాట్లాడుతూ "చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం, సరైన పోషకాహారం మరియు సమయానికి వ్యాక్సినేషన్ ఇవ్వడం వారి భవిష్యత్తు ఆరోగ్యానికి కీలకం. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తల్లిదండ్రుల్లో సరైన హెల్త్ ప్రాక్టీసులపై అవగాహన పెంచుతాయి" అని అన్నారు. మరియు పిల్లలు ఆరోగ్యంగా ఉండటం అంటే కుటుంబం ఆరోగ్యంగా ఉండటమే. కమ్యూనిటీతో కలిసి ఇలాంటి హెల్త్ ప్రోగ్రామ్‌లు చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం" అని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డితో కలిసి కావలి ఆర్ఎస్ఆర్ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్ను ప్రారంభించిన పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కావలిలో ఆర్ఎస్ఆర్ రెడ్డి ఇంటర్ నేషనల్ స్కూల్లో జరిగిన వైజ్ఞానిక్ ఉత్సవ్ కార్యక్రమానికి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డితో కలిసి తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరై సైన్స్ ఎగ్జిబిషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను వారు తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైజ్ఞానిక్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రశంసిస్తూ విద్యార్థుల మేదోశక్తిని వారు అభినందిస్తూ మోమెంటోలు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూలి కావలి ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్లో వైజ్ఞానిక్ ఉత్సవ్ కార్యక్రమంలో మాజీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి పాల్గొనడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మూడువందలకు పైగా సైన్స్ ప్రాజెక్ట్‌లు రూపొందించి ప్రదర్శించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఎంతో సృజనాత్మకతతో ఈ ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించడం వారి మేధోశక్తికి నిదర్శనమన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఒక మంచి రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకొని కావలిలో సేవాభావంతో ఇంటర్నేషనల్ స్కూల్‌ను, ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పి స్థానిక ప్రజలకు సేవలందిస్తుండడం మంచి పరిణామమని తెలిపారు. ఆర్ఎస్ఆర్ స్కూల్లో విద్యార్థులకు తక్కువ ఫీజులతో నైపుణ్యాలతో కూడిన విద్యను అందిస్తూ హైలీ క్వాలిఫైడ్ టీచర్స్‌తో విద్యను అందిస్తుండడం అభినందనీయమని తెలిపారు.

ఈ ప్రాంతంలో ఇంత మంచి విద్యాసంస్థను నెల కొల్పి కావలి ప్రాంతవాసులకు సేవలు అందిస్తుండడం రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి కావలి ప్రజల పట్ల ఉన్న ప్రేమాభిమా నాలకు నిదర్శనం అన్నారు. ఆర్ఎస్ఆర్ ఇంటర్ నేషనల్ స్కూల్ భవిష్యత్తులో మరింత పేరు ప్రఖ్యాతలు గడించాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.

# జడ్పీహెచ్ఎస్ పొట్టే పాలెం నందు ఘనంగా బాలల దినోత్సవం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారతదేశ మొట్టమొదటి ప్రధాని గౌరవనీయులు జవహర్ లాల్ నెహ్రూ జయంతి సం దర్భంగా బాలల దినోత్సవం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ పొట్టి పాలెం నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సం దర్భంగా లెట్స్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాన్స్ మాస్టర్ షేక్ సందాని భాష జన్మదినోత్సవం సందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు క్రీడా దుస్తులు బహుకరించడం జరిగింది

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి లెట్స్ హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం సుజిత్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివేటటువంటి అనేకమంది విద్యార్థులకు గతంలో అవసరమైనటువంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని ఇకమీదట కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలను గుర్తించి వారి చదువుకు కావలసినటువంటి మౌలిక అవసరాలను అందించడంలో మా ఫౌండేషన్ శాయశక్తుల కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ వినయ్ కుమార్ మరియు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు షేక్ హుస్నారా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పిఎన్ దొరువు ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పిఎన్ దొరువు ప్రాథమిక పాఠశాల నందు చాచా నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులకు ఆటలు పాటలో నిర్వహించి ప్రధానోపాధ్యాయుడు దూడల పెంచలయ్య విద్యార్థులకు విద్యార్థులకు సందేశాలు అందించారు ఆటలు పాటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయుడు దూడల పెంచలయ్య మాట్లాడుతూ బాలల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని నవంబర్ 14న నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని వారికి మంచి విద్య పోషణ రక్షణ మానసిక ఆరోగ్యం వంటి అన్ని అంశాల్లో సమగ్ర సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. బాల బాలికలందరూ బాల బాలికలందరూ సురక్షితమైన ప్రేమతో గిన్నెల వాతావ రణంలో పెరిగేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

# బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పండ్లు పంపిణీ చేసిన న్యాయవాది ఇర్ల వెంకట రమణయ్య







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్వాతంత్ర సమరయోధుడు భారతదేశపు మొట్టమొదటి ప్రధాన మంత్రి వర్యులు జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు మరియు బాలలు దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుని పండ్లు పంపిణీ చేసిన న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ భారతదేశపు స్వాతంత్ర సమరయోధుడు మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ప్రతి ఏటా బాలలు దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు నేటి బాలలే రేపటి పౌరులుగా నైతిక విలువలతో ఎదగాలని కోరారు చాచా నెహ్రూకి బాలలంటే అమితమైన ఇష్టముతో పిల్లలకు విద్యా హక్కులు కల్పించారని తెలిపారు. విద్య ప్రధాన ఉద్దేశం నేర్చుకున్న జ్ఞానాన్ని వ్యక్తిగత ప్రయోజనంతో పాటు సంఘానికి పనికొచ్చేలా ఉపయోగించడం ఇవాల్టి పిల్లలే రేపటి పౌరులు వాళ్లను మనం పెంచే తీరు నేర్పే విద్య పై రేపటి దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు ఆ మహనీయుడిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత విద్యావంతులై చెడు వ్యసనాలకు గురవకుండా నవభారత నిర్మాతలను ఎదగాలని కోరుతూ బాల బాలికలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి కొండలరావు పెంచలయ్య హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశపు గొప్ప ఆస్తి పిల్లలు

## - "ఓవెల్ పాఠశాల నందు అంగరంగవైభవంగా జరిగిన బాలల దినోత్సవం"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు అన్నమయ్య కూడలి నందున్న ఓవెల్ పాఠశాల నందు జవహర్లాల్ నెహ్రూ జన్మదిన నవంబర్14 బాలల దినోత్సవం జరపడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి ఓవెల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వేణు మాట్లాడుతూ నవంబర్ 14 భారత తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినమని పిల్లలకు ఆయనకున్న అపారమైన ప్రేమతో ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవంగ ప్రకటించారు. పిల్లలే దేశ భవిష్యత్తు గనుక ఆటపాటలతో బాగా చదువుకొని కుటుంబానికి, దేశానికి మంచి పేరు తీసుకు రావాలని అయినా కోరారు. అనంతరం పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ప్రమీల జిఎం మహాదేవయ్య, ఈడి బాలు ప్రిన్సిపాల్ రమణయ్య నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇన్చార్జులు రాజేశ్వరరావు, గిరిధర్, ఏజీఎం గంగాధర్, డీజీఎంలు, పిఈటిలు రాజేష్, కోటిరెడ్డి, సురేంద్ర మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటలు పాటలు నిర్వహించి ఉపాధ్యాయుల చేత సందేశాలు అందించి విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. అనంతనం పిల్లలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ బాలల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నవంబరు 14న నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని వారికి మంచి విద్య పోషణ రక్షణ మానసిక ఆరోగ్యం వంటి అన్ని అంశాల్లో సమగ్ర సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలియజేశారు. బాల బాలికలందరూ సురక్షితమైన ప్రేమతో నిండిన వాతావరణంలో పెరిగేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కాంతారావు. బోయి దాస్ సోమా పద్మా రత్నం. శ్రీనివాసులు. పి ఈ టి శ్రీధర్. ప్రభావతి. మృదుల. శైలజ. సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ ఐఐటి జూనియర్ కాలేజీలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు













**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని అరవింద నగర్ నారాయణ ఐఐటి జూనియర్ కాలేజీ నందు చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకి కల్చర్ యాక్టివిటీస్ అదేవిధంగా అకడ మిక్స్ కాకుండా డిస్నేను అటెండెన్స్ క్లాస్ వైస్‌గా ఎవరైతే టాప ర్‌గా ఉన్నారో వాళ్ళందరికీ ప్రైస్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్ చేసుకోవడం అంటే మన పేరెంట్స్ ఎంతో నమ్మకంతో ఇక్కడికి పంపించినందుకు ప్రతి చిల్డ్రన్స్ డేకి ఒక టార్గెట్ పెట్టుకొని ఆ టార్గెట్ రీచ్ అయ్యే దానికి కష్టపడి మీరు మంచి స్థితికి వెళ్లాలనే సందేశం ఇవ్వడం జరిగింది నారాయణ కాలేజీలో రిజల్ట్స్‌లో ఇంటర్మీడియట్ ఎంసెట్ ఏ డ్వాన్స్ మెయిన్స్ కావచ్చు ప్రతిసారి అకాడమిక్‌లో ముందుంటాం అదేవిధంగా ఇలాంటి కార్యక్రమాలలో కూడా వేము ముందు ఉంటామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డీన్ సుధాకర్ రెడ్డి. ఏజిఎం గురవయ్య. ప్రిన్సిపాల్ జయ రామారావు. తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటలు పాటలు నిర్వహించి ఉపాధ్యాయుల చేత సందేశాలు అందించి విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. అనంతనం పిల్లలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ బాలల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నవంబరు 14న నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని వారికి మంచి విద్య పోషణ రక్షణ మానసిక ఆరోగ్యం వంటి అన్ని అంశాల్లో సమగ్ర సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలియజేశారు. బాల బాలికలందరూ సురక్షితమైన ప్రేమతో నిండిన వాతావరణంలో పెరిగేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కాంతారావు. బోయి దాస్ సోమా పద్మా రత్నం. శ్రీనివాసులు. పి ఈ టి శ్రీధర్. ప్రభావతి. మృదుల. శైలజ. సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# "ఓటర్ల వారసుల మ్యాపింగ్ వేగవంతం చేయాలి: తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశాలు"



**డక్కలి, (రాజధాని వార్తలు):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) భాగంగా వారసుల అనుసంధానం (మ్యాపింగ్ ఆఫ్ ప్రోజెని) పై చర్యలను వేగవంతం చేయాలని చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించినట్లు తహసీల్దార్ ఎమ్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో బిఎల్ఓ పాల్గొన్నారని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓ మాట్లాడుతూ2002లో ఓటర్ల జాబితాలో ఉన్నవారిని ప్రస్తుత 2025 ఓటర్ల జాబితా డాటాతో పోల్చి, 35 ఏళ్లు పైబడిన వారిని గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే వారి కుటుంబ సభ్యులు (కుమారుడు, కుమార్తె, మనవడు, మనవరాలు) ప్రస్తుత ఓటర్ల జాబితాలో ఉంటే, వారిని సంబంధిత ఓటరుతో మ్యాపింగ్ చేసే విధానంపై పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చారు. అనంతరం డక్కలి మండల పరిధిలోని బి.ఎల్.ఓలు, సూపర్వైజర్లతో తహసీల్దార్ శ్రీనివాసులు రివ్యూ నిర్వహించారు. "2002–2025 మధ్య నమోదైన ఓటర్ల కుటుంబ వారసులను ఇంటింటా తిరిగి సరి చూసి, వచ్చే నాలుగు రోజుల్లో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి" అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తక్కువ పురోగతి చూపుతున్న బి.ఎల్.ఓలు వెంటనే వేగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి కూడా పాల్గొన్నారు.

# రోడ్డు మీదకు డ్రైనేజీ నీరు రావడంతో తక్షణ చర్యలు చేపట్టిన 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు సిటీ 47వ డివిజన్ పరిధిలోని గుప్తా పార్క్, నారాయణరావుపేట ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిండిపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి ప్రవహించి దారి దెబ్బతినడమే కాకుండా స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. రోజూ నిర్వహించే మార్నింగ్ వాక్ ఇన్‌స్పెక్షన్ సమయంలో ఈ సమస్యను 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ స్వయంగా గమనించి తక్షణమే స్పందించారు. గౌరవనీయులు మున్సిపల్ పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ సహకారంతో, వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందజేశారు. కార్పొరేటర్ ఆదేశాల మేరకు యుజిడి సిబ్బంది రాజేష్, శానిటేషన్ సిబ్బంది అశోక్, మేస్త్రి శేఖర్ సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకుని గల్ఫర్ మిషన్ సహాయంతో మాన్‌హోల్స్ తెరిచి నిల్వ ఉన్న డ్రైనేజీ నీటిని పూర్తిగా తొలగించారు. అనంతరం డ్రైనేజీ లైన్లలో ఉన్న బ్లాకేజీలు క్లియర్ చేశారు. తర్వాత శానిటేషన్ బృందం మొత్తం ప్రాంతాన్ని శుభ్రపరచి బ్లీచింగ్ స్ప్రే చేసి దుర్వాసన, ఆరోగ్య సమస్యలు రాకుండా చర్యలు చేపట్టింది. ప్రజల ఆరోగ్యం, శుభ్రత కోసం తక్షణ స్పందన ఇవ్వడమే తమ ధ్యేయమని కార్పొరేటర్ రామకృష్ణ తెలిపారు.

# నెల్లూరు సిటీ 47వ డివిజన్ పర్యటనలో కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గౌరవనీయులు మున్సిపల్ పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ సహకారంతో నెల్లూరు సిటీ 47వ డివిజన్ పరిధిలోని అగ్నిపేట, గుప్తా పార్క్, నారాయణరావుపేట ప్రాంతాల్లో 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి శానిటేషన్ మరియు త్రాగునీటి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి తక్షణ పరిష్కారం చూపించాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ కోటపాటి రాజా, రెహమాన్, బిఎల్ఓ పిల్ల ప్రసాద్, చంద్ర, ఐటిడిపి మహంకాళి సురేంద్ర పాల్గొన్నారు.

# నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో "నక్ష" పేరుతో ప్రభుత్వ ఆస్తులకు మ్యాపింగ్ ప్రక్రియ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం వార్డు సచివాలయ వి.ఆర్.ఓలు, పట్టణ ప్రణాళిక విభాగం నక్ష ప్రాజెక్ట్ బృందంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష ప్రాజెక్టు నిర్వహణకు సంబంధిత వార్డు సచివాలయ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు అందరూ సహకరించాలని కమిషనర్ ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ భూములు, ప్రభుత్వ భవనాలు, దేవస్థానాలు, ప్రధాన మార్గాలు, మేజర్ కాలువలు అన్నింటిని నక్ష ప్రాజెక్టు ద్వారా మ్యాపింగ్ చేయించాలని కమిషనర్ సూచించారు.

ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ హిమబిందు, నక్ష నోడల్ ఆఫీసర్ సతీష్ కుమార్, వార్డు సచివాలయ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు, వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సామాజిక సేవకు అంకితమైన మనోబంధు ఫౌండేషన్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రోడ్లు, బస్టాండ్‌లు, ఫ్లాట్ ఫ్లాట్ ఫామ్‌లు వంటి ప్రదేశాలలో మానసిక స్థితి సరిగా లేని, ఎందరో అనాధలకు మనోబంధు ఫౌండేషన్ ఆశ్రయం కల్పిస్తూ సామాజిక సేవకు అంకితమై చేస్తున్న సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.మనో బందు ఫౌండేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న క్యాంపైనింగ్ అక్టోబర్ 23 నుండి నవంబర్ 18 వరకు సామాజిక సేవా కార్యక్రమం కొనసాగుతోందని ఈ అవకాశాన్ని మతి స్థిమితం లేని అనాధలను చేర్పించేందుకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో మనోబంధు ఫౌండేషన్, జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ శర్మ తదితరులు మనోబంధు ఫౌండేషన్ ప్రచార క్యాంపెయిన్ గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్ నాలుగు సంవత్సరాలుగా నడుస్తోందని రోడ్ల మీద, రైల్వేస్టేషన్లో వంటి ప్రాంతాలలో మతి స్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతున్న వారి జాడ తెలుసుకొని వారికి అండగా నిలవడం జరుగుతుందన్నారు. అనాధలైన మానసిక రోగులను గుర్తించి మానసిక సేవలో మనోబంధు అండగా నిలుస్తుందన్నారు. విశాఖ పట్నంలో ఉచితంగా వైద్య సేవలు అందించి పూర్తిగా ఆరోగ్యవంతులుగా మారిన తరువాత వారి అడ్రస్‌కు ఫౌండేషన్ సభ్యులే నేరుగా తరలిస్తారన్నారు. అడ్రస్ లేని వారికి హెూమ్‌నందు నివాసం కల్పిస్తారన్నారు. మనోబంధు ఫౌండేషన్ ఫౌండర్ భూపతి రాజు రామకృష్ణ రాజు, రెడ్ క్రాస్ సంయుక్తంగా ఈ సామాజిక సేవాకార్యక్ర మాల ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఒక్క నిరాశ్రయ మానసిక రోగులు కూడా రోడ్లపై ఉండకుండా అందరూ సురక్షితంగా ఆసుపత్రులు, షెల్టర్ హెూమ్లలో ఉండాలన్నదే మనోబంధు ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. సేవా స్ఫూర్తికి ప్రత్యేకగా నిలిచిన ఏపీ రెడ్ క్రాస్ సొసైటీ మనోబంధు ఫౌండేషన్ భాగస్వామిగా పాల్గొంటుందని అన్నారు. ఈ మానవతా యజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని మనస్ఫూర్తిగా కోరు కుంటున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి బాల సురేష్ తెలిపారు. మనో బంధు ఫౌండేషన్‌లో ముగ్గురు విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ముగ్గురు ప్రముఖ వైద్యులు ట్రస్టీలుగా ఉన్నట్లు తెలిపారు. మానవ సేవలో మనోబంధు నిలిచి కొందరు ప్రముఖ సమాజ సేవకుల సమన్వయంతో నిరాశ్రయ మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారిని వెతికి వైద్యశాలలో చేర్పించేందుకు కృషి జరుగుతుందన్నారు. అధికారులు, వైద్యులు, మున్సిపల్ సిబ్బంది, పోలీస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రతి ఒక్క బాధితున్ని సురక్షితంగా ఆసుపత్రిలో చేర్పించడం ఫౌండేషన్ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి పి ఎస్ శర్మ రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ కళాశాలలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు

**నెల్లూరు సిటీ, (రాజధాని వార్తలు):** నగరంలోని హరినాధపురంనందు గల నారాయణ జూనియర్ కళాశాలలో శుక్రవారం చిల్డ్రన్స్ డే సెల బ్రేషన్స్ ఘనంగా జరిగాయి. కళాశాల డీజీఎం మధుసూదన్ రెడ్డి, కోర్ దీన్ కే శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కామాక్షి తదితరులు పాల్గొని విద్యార్థులకు చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవ విశిష్టతను విద్యార్థులకు వివరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.



# 17 మెడికల్ కాలేజీలో సందర్భంగా కూటమికి వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి సంతకాల సేకరణ





**ఎటపాక (గౌరీ దేవి పేట), (రాజధాని వార్తలు):** గౌరీదేవిపేట గ్రామపం చాయతీలో ముమరంగా వైస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం. వైస్సార్సీపీ మండలం అధ్యక్షులు ఆకుల వెంకటరామారావు (పెద్దోడు) ఈ రోజు ఏటపాక మండలం గౌరీదేవిపేట గ్రామపంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేసే దానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. మరియు గ్రామ కమిటీ సభ్యులు ఎను కొవటం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా కొరకాసులు సూర్యప్రకాష్ రావుని ఏనుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొప్పుల వెంకటేశ్వరావు కోడూరు నవీన్ కుమార్ కొరకాసులు సూర్యప్రకాష్‌రావు దొంతు సాయిబాబా దార రమేష్ దార రవి తాలూరి శామ్ ఆకుల దయాకర్ జంగాల సాయిబాబా తామర పల్లి ప్రదీప్ మొగడ చంద్రశేఖర్ వసంతాలు బాబు మోట వంశీ పలాంటి తేజ్ మలేలా లక్ష్మణ్ రావు మొగిలి వెంకన్న ములకలపల్లి రమేష్ మదరు రామిశెట్టి వెంకన్న సాగర్ ములకలపల్లి రావణయా తుంగ రాజు పాయం వెంకట్రావు కారం దుర్గ సాయి కోటేష్ తుంగల నర్సింహా రావు ఆకుల శివ మొగిలి క్రాంతి కుమార్ నూపా కృష్ణ ములకల పల్లి విజేయ బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు : తహసీల్దార్ శ్రీనివాసులు

**డక్కలి, (రాజధాని వార్తలు):** దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక బాలికల గురుకులంలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలల దినోత్సవం అంటే మన రాబోయే తరాల ఆశయాలకు ప్రతీక అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, భద్రత, నైతిక విలువలు కలిగిన సమాజాన్ని అందించడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. పాఠశాలల ఆధునీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రపంచ స్థాయి విద్య అందించే లక్ష్యంతో డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఇంగ్లీష్ మీడియం బోధన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింతగా బలోపేతం చేసిందని అన్నారు. అంగన్‌వాడీలు, బాలల ఆరోగ్య పరీక్షలు, పోషకాహార పంపిణీ వంటి సేవలను ప్రభుత్వం క్రమబద్ధంగా, పారదర్శకంగా అమలు చేస్తున్నదని శ్రీనివాసులు వివరించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ధైర్యంగా, సమాజంలో నిలదొక్కుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అంతకుముందు ఆయన విద్యార్థినీలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి అంగన్‌వాడీ అధికారి సంషాద్ బేగం, కళాశాల ప్రిన్సిపాల్, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan